క్లుప్తంగా

మరియమ్మకు నివాళులు


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

మర్రిపూడి: వైఎస్సార్ సీపీ మండల నాయకుడు గురజాల ఏబు తల్లి మరియమ్మ(68) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు


ఎరువుల దుకాణంలో రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఏడీఏ

కొండపి: రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ బి.రమేష్‌బాబు అన్నారు. మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి ఎరువులు విక్రయిస్తున్న డీలర్లు తప్పనిసరిగా ధరల పట్టిక, స్టాక్ వివరాలను ఎప్పుడికప్పుడు నమోదు చేయాలన్నారు. వివరాలు సక్రమంగా లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. అనధికారికంగా ఎరువులు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తామన్నారు. రైతులు విధిగా బిల్లు ఇవ్వాలన్నారు. తనిఖీల్లో వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్, ఏఈఓ కుమార్ పాల్గొన్నారు.

పొగాకు బోర్డులో స్వచ్ఛభారత్


మొక్కలు నాటుతున్న వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా చేసుకొని మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణంలో కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. అనంతరం పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు.

19న షిర్డీ సాయి ఆలయ రజతోత్సవాలు

సింగరాయకొండ: స్థానిక షిర్డీ సాయి మందిర్‌లో ఈనెల 19వ తేదీ మంగళవారం రజతోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు కొల్లూరి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సామూహిక విష్ణు సహస్రనామం, సాయి చాలీసా, కనకధారాస్తోత్రము పారాయణం, తిరుపతికి చెందిన ఏకవీర ఫౌండేషన్, సురభి గోరక్షణశాల వారిచే పుష్పయాగం, అన్న సంతర్పణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు


వేములపాడు బస్టాండ్ సెంటర్‌లో అధ్వానంగా ఉన్న రోడ్లు


హనుమంతునిపాడు పాత బస్టాండ్ సెంటర్‌లో గుంతలమయమైన కంభం - కనిగిరి రహదారి

హనుమంతునిపాడు: మండల పరిధిలో అధ్వాన రోడ్లతో అవస్థలు తప్పడం లేదు. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లపై వర్షం నీరు నిలిచి పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. రోడ్లపై ఎక్కడ చూసినా మోకాలి లోతు గుంతలు కనిపిస్తున్నాయి. దీంతో వాహనదారులు గుంతల రోడ్లపై ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కంభం కనిగిరి రహదారి కనిగిరి మొదలుకొని వేములపాడు వరకు 23 కిలోమీటర్లు రోడ్డు గుంతలు పడి అధ్వానంగా ఉంది. దీంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. కంభం కనిగిరి బస్సు ప్రయాణం అరగంట ప్రయాణానికి రోడ్లపై గుంతలతో గంటకు పైనే పడుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. రాత్రిళ్లు ద్విచక్రవాహనదారులు గుంతలు తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. బస్టాండ్ సెంటర్‌లో మురుగు చెరువులను తలపిస్తున్నాయి. అధికారులు స్పందించి కంభం కనిగిరి రహదారికి గుంతలను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధికారులపై ప్రజాప్రతినిధుల ధ్వజం

- వాడీవేడిగా మండల సమావేశం
- పనులు చేయకుండానే బిల్లులు చేశారని నిలదీసిన ఎంపీటీసీలు, సర్పంచులు


ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని నిలదీస్తున్న ఎంపీటీసీ వెంకట సుబ్బారెడ్డి

హనుమంతునిపాడు: మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వాడీవేడీగా సాగింది. సమావేశంలో అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాగర్ జలాలు సక్రమంగా రాకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఎంపీటీసీ ఉడుముల వెంకట సుబ్బారెడ్డి, సర్పంచులు సానికొమ్ము బ్రహ్మారెడ్డి, కత్తి రాజారావు నిలదీశారు. పైపులైన్లు పనులు జరగకుండానే పనులకు బిల్లులు చేశారని ఎంపీడీఐ, ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఇళ్లు కట్టకుండా హౌసింగ్ ఏఈ బిల్లులు ఇచ్చారని ప్రశ్నించారు. విద్యుత్ ఏఈ మణికంఠ కొత్త లైన్లు వేసేందుకు రైతులను సంప్రదించకుండానే అడ్డదిడ్డంగా వేశారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో విద్యుత్ అధికారుల చేతివాటానికి అడ్డే లేకుండా పోయిందని మండిపడ్డారు. ఐసీడీఎస్ అధికారులు ఉన్నారో లేరో కూడా తెలియడం లేదని, ఇన్‌ఛార్జిలు సక్రమంగా పనులు చేయడం లేదని సర్పంచులు, ఎంపీటీసీలు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాలపై సభలు సమావేశాలు సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు తెలియపర్చకుండానే నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రోటోకాల్ పాటించడం లేదని సర్పంచ్ సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, భవనం కృష్ణారెడ్డి, ఎంపీటీసీ నారాయణ స్వామి, ఎంపీటీసీ తానిగుండాల తిరుపతరెడ్డిలు అధికారులపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఎంపీపీ గాయం సావిత్రి మాట్లాడుతూ అధికారులు ఇష్టానుసారంగా పనులు చేయకుండా ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలన్నారు. సమావేశాల్లో ఎలా మాట్లాడాలో నేర్చుకోవాలని విద్యుత్ ఏఈ మణికంఠానికి సూచించారు. రైతులు అడిగిన దానికి సరైన సమాధానం చెప్పాలన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు, వైస్ ఎంపీపీ రుద్రపాటి శోభ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

టంగుటూరు: గ్రంథాలయ వారోత్సవాల బ్రోచర్‌ను బుధవారం పంచాయతీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు వర్ధనరాజు మాట్లాడుతూ వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు.

సాగునీటి సంఘం ఎన్నికల ఓటర్లు 4,752 మంది

సింగరాయకొండ: మండలంలో బుధవారం సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి 4,752 ఓటర్లతో కూడిన తుది జాబితాను తహశీల్దార్ టి. రవి విడుదల చేశారు. ఈ ప్రకారం ఎన్నికలు జరిగే కలికవాయ, కనుమళ్ల, సోమరాజుపల్లి, పాకల, బింగినపల్లి గ్రామ సచివాలయాల్లో ఓటరు జాబితాను పబ్లిష్ చేసినట్లు పేర్కొన్నారు. మైనర్ ఇరిగేషన్ చెరువులకు సంబంధించి కలికవాయలో 331 మంది, కనుమళ్లలో 584, సోమరాజుపల్లిలో 248 మంది ఓటర్లు ఉండగా, మీడియం ఇరిగేషన్ చెరువులకు సంబంధించి సోమరాజుపల్లిలో 806 మంది, పాకల-1 లో 574, పాకల-2 లో 1,222 మంది ఓటర్లు, బింగినపల్లిలో 987 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన వివరించారు. ఈ నెల 23వ తేది ఎన్నికలు జరగనున్నట్లు వివరించారు.

కొనసాగుతున్న విస్తరణ పనులు


తొలగింపులు చేపడుతున్న టీపీఎస్ అధికారులు

కనిగిరి రూరల్: పట్టణంలోని పామూరు రోడ్డు, చర్చి సెంటర్, చెప్పుల్ బజార్ రోడ్డులలో రోడ్డు విస్తరణలో భాగంగా నిర్మాణాలను, తాత్కాలికి షెడ్లు, రేకుల గదులను మున్సిపల్ అధికారులు బుధవారం తొలగించారు. కనిగిరి నుంచి కందుకూరు రోడ్డు, కనిగిరి నుంచి పామూరు రోడ్డు, చెప్పుల్ బజార్‌లో కొంతమేర కట్టడాలను తొలడించారు. ప్రధాన రహదారికి ఇరువైపులా చప్టాలు, కాలువలపై ఉన్న నిర్మాణాలను పూర్తిగా కింద స్థాయి నుంచి తొలగించారు. మెయిన్ డ్రైనేజీపై, ఫుట్ పాత్ చప్టా నిర్మాణాలను పూర్తిస్థాయిలో పగుల కొట్టారు. దీంతో పట్టణంలో కొంతమేర ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గింది. దీంతో తోపుడు బండ్లను ఫుట్ పాత్ పై పెట్టుకుని వ్యాపారం చేసుకునే వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక్కసారిగా తొలగింపుల కార్యక్రమం చేపట్టడం, ప్రధాన రోడ్డు కావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

మున్సిపల్ స్థలం ఉన్నంత వరకు తొలగింపులు చేస్తాం: సువర్ణ కుమార్, టీపీఎస్.

పట్టణంలోని ప్రధాన రోడ్డు జంక్షన్‌లో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాం. పామూరు రోడ్డు వైపు ప్రభుత్వ ఆస్పత్రి గోడ దగ్గర నుంచి హోటల్ వరకు సుమారు 94 నుంచి 95 అడుగుల రోడ్డు విస్తీర్ణం ఉండాలి. అలాగే చర్చి గోడవైపు నుంచి ఇటు బేకరి వరకు సుమారు 64 నుంచి 65 అడుగులు రోడ్డు ఉండాలి. మున్సిపల్, రెవెన్యూ రికార్డుల ప్రకారమే కట్టడాలను, నిర్మాణాలను తొలగించాం. చెప్పుల్ బజార్‌లో రెండు రేకుల షెడ్డులు లాడేసాహెబ్ వీధి దారికి ఆక్రమణలో ఉన్నందున వాటిని కూడా తొలగించారు. రోడ్లకు ఇరువైపుల ఉన్న శాశ్వత గృహ, భవనాల కట్టడ దారుల డ్యాక్యుమెంట్‌ను పరిశీలించి. వారికి హక్కు ఉన్నవాటిని వదిలేస్తున్నాం. శాశ్వత నిర్మాణదారులు చూపించిన రికార్డులు, మున్సిపల్ రికార్డుల్లోని కొలతలను పరిశీలించి, వాస్తవికతను నిర్ధారించుకున్న తర్వాతనే శాశ్వత కట్టడాలను తొలగిస్తాం. దానికి సంబంధించి సబంధిత నిర్మాణ యజమానులకు ముందుగా తెలియచేస్తాం. రోడ్డు విస్తరణ పనులు పామూరు రోడ్డు వైపు బీఎస్ఎన్ఎల్ ఆఫీసు వరకు గురువారం కొనసాగిస్తాం. ఆ తర్వాత కందుకూరు రోడ్డు, ఓవీ రోడ్డు వైపు పూర్తిగా చేపడతాం. మెయిన్ రోడ్డు కావడంతో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

అటవీ శాఖ కార్యాలయం తనిఖీ

కనిగిరి రూరల్: కనిగిరిలోని అటవీ శాఖ కార్యాలయాన్ని అటవీ సంరక్షణ అధికారి గుంటూరు విశ్వనాథరాజు మంగళవారం తనిఖీ చేశారు. కార్యాలయంలోని ఎర్రచందనం గోడౌన్‌లను పరిశీలించి స్టాక్ వివరాలు, ఎన్ని కేసులకు సంబంధించి సరుకు నిల్వ ఉంది, ఇటీవల కాలంలో ఏమైనా పట్టుకున్నారా వంటి అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టాక్ రికార్డులు, కార్యాలయ రికార్డులు పరిశీలించారు. అనంతరం అటవీ శాఖ రేంజ్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. తొలుత హాజీపురం సమీపంలో నగర వనాన్ని పరిశీలించి అక్కడ జరుగుతున్న మొక్కల ప్లాంటేషన్‌ను స్వీయ పరిశీలన చేశారు. ఏపీ మొక్కలు, ఎన్నిరకాల మొక్కలు పెంచుతున్నారనే దాని వివరాలు తెలుసుకుని, ప్లాంటేషన్ నిర్వహణపై సూచనలు చేశారు. డెక్‌లను, వాచ్ టవర్‌ను ఎక్కి పరిశీలించారు. జిల్లా అటవీ శాఖాధికారి హిమశైలజ, ఏసీఎఫ్ శ్రీనివాస్, కనిగిరి ఫారెస్ట్ రేంజర్ తుమ్మల ఉమా మహేశ్వరరెడ్డి, కనిగిరి సెక్షన్ అధికారి ఫరూకీ, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించండి

పామూరు: రైతులు పొగాకు స్థానంలో ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపాలని వ్యవసాయాధికారి కంచం రాధ అన్నారు. మండలంలోని నుచ్చుపొద, ఇనిమెర్ల గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ రాధ మాట్లాడుతూ పొగాకును బోర్డు వారు నిర్దేశించిన విస్తీర్ణం మేరకే బ్యారన్ పరిధిలో సాగుచేయాలన్నారు. పొగాకుకు బదులుగా రైతులు జొన్న, శనగ, అలసంద, మొక్కజొన్న, మినుము పంటలను సాగు చేసుకోవాలన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర వస్తుందన్న నమ్మకం లేదన్నారు. రైతులు అధిక విస్తీర్ణంలో పొగాకు సాగు చేసి నష్టపోవద్దని సూచించారు. వీఏఏలు యం.శ్రీనివాస కల్యాణ్, సీహెచ్.సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): కందిపైరును ఆశించే తెగుళ్ల నియంత్రణపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని పెద గోగులపల్లి, ఆర్‌కేపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. కందిపంటను పరిశీలించిన ఏఓ కందిలో మారుకా మచ్చలపురుగు ఆశించినట్లు గుర్తించి నివారణ రైతులకు వివరించారు. మినుములో విత్తనశుద్ధి, ఎండుతెగులు నివారణపై వివరించారు. రబీలో పంటలు సాగుచేసిన రైతులు ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజనలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఏఈఓ పి.శ్రీనివాసులు, వీఏఏలు యం.వెంకటరెడ్డి, వీహెచ్ఏ ఎ.వెంకటేశ్వర్లు, వీపీహెచ్ డి.నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన


రోడ్డుపై చిల్ల కంప వేసి నిరసన తెలుతున్న స్థానికులు

కనిగిరి రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని 11వ వార్డుకు చెందిన టకారిపాలెం కాలనీవాసులు రోడ్డుపై చిల్లకంప వేసి బస్సులను ఆపి మంగళవారం నిరసన తెలిపారు. తమ కాలనీలో రోడ్డు, నీటి వసతి, డ్రైనేజీ సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నామని, కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ స్థానికులు కనిగిరి- పాదిలి ప్రధాన రహదారిపై చిల్ల కంప వేసి బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో బస్సులు, వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. దాదాపు అరగంట సేపు వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్సై టి.శ్రీరాం, పోలీస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్య ఉంటే కార్యాలయాలకు వెళ్లి తెలియజేయాలే గానీ రోడ్డెక్కి వాహనాలు ఆపడం సరైంది కాదన్నారు. కొద్ది సేపు పోలీసులకు, నిరసనకారులకు మధ్య వాదన జరిగింది. ప్రయాణికులకు ఇబ్బంది పెట్టి, వాహనాలను ఆపితే మీరే ఇబ్బంది పడతారని ఎస్సై చెప్పడంతో ఆందోళనకారులు సర్దుకున్నారు.

గోకులం షెడ్లు త్వరగా పూర్తి చేయాలి


గోకులం షెడ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న లలిత కుమారి

మర్రిపూడి: గోకులం షెడ్లను త్వరగా పూర్తి చేయాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్.లలిత కుమారి ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని వివిధ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులతో చేపడుతున్న గోకులం షెడ్లు రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులను దర్శి క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్ లలితకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో మాట్లాడారు. గోకులం షెడ్లను త్వరగా నిర్మించుకోవాలన్నారు. ప్రభుత్వ భవనాల దగ్గర నిర్మిస్తున్న ఇంకుడు గుంతలు త్వరగా పూర్తి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఏపీఓ రాంబాబు, టెక్నికల్ అసిస్టెంట్లు నాగరాజు, ఖాజావలి, ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీను,ఏడుకొండలు,హరీష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి


వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పామూరు: స్థానిక నెల్లూరురోడ్డు విరాట్ నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి 416వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల మూల విగ్రహామూర్తులకు అర్చకులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు రుత్వికుల వేదమంత్రాల నడుమ నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో మహాగణపతిపూజ, పుణ్యాహవచనం, మహారుద్రహోమం నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. పూజల్లో నొస్సం నాగేంద్రాచారి, ఆలయ కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకులకు పరామర్శ


రఘునాథపురంలో కృష్ణయ్యను పరామర్శిస్తున్న దద్దాల నారాయణ

పామూరు: మండలంలోని ఇద్దరు వైఎస్సార్ సీపీ నాయకులను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ బుధవారం పరామర్శించారు. రఘునాథపురం గ్రామానికి చెందిన కోనేటి కృష్ణయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్రగాయాలై చెన్నైలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం బొట్లగూడూరులో అనారోగ్యంతో ఉన్న బాలుబోయిన కోటేశ్వరరావును పరామర్శించి ఆరోగ్యంపై చర్చించి త్వరలో కోలుకోవాలని ఆకాంక్షించారు. మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, అంబటి కొండారెడ్డి, ఎంపీటీసీ పోలినేని శ్రీనివాసులు, షేక్.చాంద్‌బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న జాలా అంజయ్య

సీఎస్‌పురం(పామూరు): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ నాయకుడు జాలా అంజయ్య అన్నారు. సీపీఎం మండల 6వ మహాసభ బుధవారం సన్నపురెడ్డి తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన జాలా అంజయ్య మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెట్టే యత్నం చేస్తున్నారన్నారు. నరేంద్రమోదీ పాలనలో దేశం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యాన్ని వ్యాపారరంగంగా మార్చాయని, ప్రైవేట్ విద్యారంగాన్ని ప్రోత్సహిస్తూ పేదలకు విద్యను దూరంచేశాయన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మభ్యపెట్టేలా పాలన చేస్తున్నారని మండిపడ్డారు. ఉచిత గ్యాస్ పేరుతో ప్రభుత్వం రూ.2,600 కోట్లు ఇచ్చి ట్రూప్ ఆప్ చార్జీల పేరుతో రూ.18 వేల కోట్లు వసూలు చేసి ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. సీపీఎం పశ్చిమ ప్రకాశంజిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, సీపీయం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం రమేష్, సీఎస్‌పురం, పామూరు మండల కార్యదర్శులు ఊసా వెంకటేశ్వర్లు, కె.మాల్యాద్రి, ఎం.రత్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో భారీ వర్షం

సింగరాయకొండ: మండలంలో భారీ వర్షం కురిసింది. జిల్లాలోనే అత్యధికంగా 70.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షం వరి సాగుకు ఎంతో ఉపయోగకరమని వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. మండలంలో రైతులు వరినార్లు పోసుకున్నారని, రెండు రోజుల పాటు వర్షం కురిస్తే పూర్తి స్థాయిలో వరినాట్లు వేసుకోవడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వర్షంతో రోడ్లు జలమయం కాగా వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బాలయోగినగర్ సెంటర్‌లో రోడ్లు గుంతలు పడి వర్షంనీరు నిలవడంతో ఇబ్బందులు పడ్డారు.

టంగుటూరు: అల్పపీడన ప్రభావంతో బుధవారం మండలంలో భారీ వర్షం కురిసింది. మండలంలో 34.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. టంగుటూరు సెంటర్లో, జయవరం, జమ్ములపాలెం గ్రామాల్లో వర్షంనీరు నిలిచి రోడ్లపై పొంగిపొర్లాయి. కందులూరు, మర్లపాడు, కొణిజేడు గ్రామాల్లో మినుము తోటల్లో వర్షం నీరు నిలిచింది.

పొన్నలూరులో మోస్తరు వర్షం

పొన్నలూరు: మండలంలో బుధవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లోని రోడ్లు జలమయం కావడంతో పాటు చెక్‌డ్యాంలు, వాగులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. గ్రామాల్లోని చెక్‌డ్యాంలు, కుంటల్లోకి వర్షపు నీరు చేరడంతో శనగ, పొగాకు పంటల సాగుకు ప్రయోజనం చేకూరుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే భూగర్భ జలాలు పెరిగి తాగునీటికి కూడా సమస్య ఉండదని ప్రజలు సంతోష పడుతున్నారు. అయితే అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో మినుము, మిరప పంటలు కొంతమేరా నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

భుజంగేశ్వర ఆలయ దుకాణాలకు వేలం

పామూరు: స్థానిక శ్రీవల్లీ సమేత భుజంగేశ్వరస్వామి ఆలయంకు చెందిన 10 దుకాణాలకు బుధవారం ఈఓ గిరిరాజ నరసింహబాబు వేలం నిర్వహించారు. 10 దుకాణాలకు నెలకు రూ.83 వేలు అద్దెకింద వేలంలో నిర్ధారించినట్లు తెలిపారు. వేలంలో పాతవారికే దుకాణాలు కేటాయించారు.

బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలి

పొన్నలూరు: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తించి అండగా నిలవాలని కొండపి సీఐ సోమశేఖర్ పోలీసులకు సూచించారు. పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, కేసుల డైరీలను, పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బంది, మహిళా పోలీసులతో మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల బాధ్యతగా నడుచుకోవాలన్నారు. పెండింగ్ కేసులను విచారణ చేసి సంబంధిత కోర్టుకు పంపాలన్నారు. కేసుల విషయంలో నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ముఖ్యంగా గంజాయి, పేకాట, గుట్కాలపై ప్రత్యేక నిఘా పెట్టి మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బెల్ట్ షాపులు, అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలన్నారు. విధుల్లో అలసత్వం వహించి అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

పాఠశాలలపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలి



పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు తల్లిదండ్రులు

పీసీపల్లి: పాఠశాలలపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. మండలంలోని పెద్ద వరిమడుగు పాఠశాలలో పనిచేస్తున్న కుకింగ్ ఏజెన్సీని మార్చవద్దని పాఠశాల పరిధిలోని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులను కలిసి అర్జీ అందజేశారు. అనంతరం పాఠశాల వద్ద నిరసనకు దిగారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకువచ్చినా, కుకింగ్ ఏజెన్సీలను మార్చినా మా పిల్లలకు టీసీలకు ఇవ్వాలని ప్రధానోపాధ్యాయులకు రాతపూర్వకంగా రాసి ఇచ్చారు. కావాలనే టీడీపీకి చెందిన కొంత మంది పాఠశాలల్లో రాజకీయాలు చేస్తున్నారని ఉన్నతాధికారులు స్పందించకుంటే ఆపకుంటే మా పిల్లలకు టీసీలు తీసుకొని వేరే పాఠశాలల్లో చేర్చుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులను తీసుకొని తల్లిదండ్రులు పాఠశాల నుంచి వెళ్లిపోయారు.